


మన్యంలో పెరిగిన చలి తీవ్రత



రోడ్డుపై కురుస్తున్న మంచు

గుమ్మలక్ష్మీపురం : తుఫాను మబ్బులు ప్రభావం వీడడంతో మన్యంలో మళ్లీ చలి తీవ్రత ఒక్కసారిగా పెరిగింది. ఏజెన్సీ అంతటా పొగమంచు కురవడంతో సాయంత్రం 5 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 10 గంటల వరకు చలి ప్రభావం కనిపిస్తోంది. ఉదయం 9గంటల వరకు మంచు కురవడంతో పగటి ఉష్ణోగ్రతలు కనిష్టంగా నమోదవుతున్నాయి. ఉదయం వేళ ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో చలిమంటలు వేసుకుని వెచ్చదనం పొందుతున్నారు.



మిల్లర్ల మాయాజాలం

- క్వింటాకు ఐదు నుంచి పది కిలోల ధాన్యం వడ్డింపు
- చేతులెత్తేసిన అధికారులు
- మొక్కుబడిగా తనిఖీలు

ప్రజాశక్తి - పార్వతీపురం

ఈ ఏడాది ధాన్యం కొనుగోలు సీజన్‌లో జిల్లాకు సంబంధించినంత వరకు రైస్ మిల్లుల యజమానులదే హవా నడుస్తోంది. మిల్లర్లంతా సిండికేట్‌గా ఏర్పడడంతో రైతుల నిలువ శ్రమదోపిడీ యధేచ్ఛగా కొనసాగుతోంది. ధాన్యం విక్రయించిన రైతులకు సకాలంలో డబ్బులు చెల్లిస్తున్నామని గొప్పలు చెపుతున్న మిల్లర్ల మాయాబజార్‌లో నష్టపోతున్న పరిస్థితి కనిపిస్తోంది. క్వింటాల్‌కు అదనంగా ఐదు కిలోల నుంచి పది కిలోల వరకు ధాన్యాన్ని మిల్లు యజమానులు గుంజుకుంటున్నారు. మిల్లు యజమానుల దందాలకు ప్రధాన కారణం అధికార పార్టీ నాయకుల అండదండలు పుష్కలంగా ఉండడమేనని రైతులు ఆరోపిస్తున్నారు. జిల్లాలో చాలా మంది వ్యాపారులు టిడిపి కూటమి పార్టీలు, వైసిపి నాయకులే ఉండడంతో ఇష్టారాజ్యంగా కొనుగోలు చేస్తున్నారు. వేలాది రూపాయల మదుపు పెట్టి, ఆరుగాలం శ్రమించిన రైతులు వరి పంట సాగులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో ప్రధానంగా పార్వతీపురం నియోజకవర్గంలో అధికంగా రైస్ మిల్లులు ఉన్నాయి. సీతానగరం, పార్వతీపురం, బల్జిపేట మండలాల్లో సుమారు 30పైగా రైస్ మిల్లులు వున్నాయి. ఈ మిల్లుల యజమానులకు అధికారపార్టీకి చెందిన ముఖ్యనేత మద్దతు ఉండడంతో రైతుల నుంచి ఇష్టారాజ్యంగా కొనుగోలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ధాన్యానికి గిట్టుబాటు ధర అందని ద్రాక్షలా తయారైంది. తేమ శాతం, రంగు మారడం, పొల్లు శాతం వంటి అంశాలను సాకుగా చూపి ఐదు నుంచి పది కిలోల వరకు ధాన్యాన్ని దోచుకుంటున్నారు. ఇలా దోపిడీ చేసిన లాభాల్లో కొంతమంది పెద్దలకు కూడా వాటాలు అందుతాయన్న ప్రచారం సాగుతోంది. అందుచేతనే మిల్లు యజమానులు దోపిడీకి తెరలేపినట్లు తెలుస్తోంది. జిల్లాలో 150 కొనుగోలు కేంద్రాల్లో శనివారానికి 49,187 టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. జిల్లాలో 2.5లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇంకా సీతంపేట, భామిని మండలాల్లో వరి కోతలు ప్రారంభం కాకపోవడంతో ధాన్యం కొనుగోలు ప్రారంభం కాలేదు. రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోళ్లు జరుగుతున్నాయి. 40కిలోల బస్తా కి అదనంగా రెండు కిలోల ధాన్యం లెక్కించి రైతు సేవా కేంద్రాల సిబ్బంది వాహనాల ద్వారా తరలిస్తున్నారు. తూనిక కాటాల వద్ద తూయించిన బరువులో మిల్లర్లు నాణ్యత ప్రమాణాలు సాకు చూపి కోత విధిస్తున్నారు. మిల్లు దాకా వెళ్లిన రైతులు తిరిగి ధాన్యం ఇంటికి తీసుకురాలేక మిల్లర్ల ఇష్టారాజ్యానికి తలవంచక తప్పని పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతులు క్వింటాలుకు సుమారు రూ.300వరకు నష్టపోయే అవకాశం ఉంది.

తూతూమంత్రంగా అధికారుల పర్యవేక్షణ

జిల్లాలో ధాన్యం కొనుగోలులో మిల్లు యజమానుల దందాలకు అడ్డుకట్ట వేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. రైతులకు ధాన్యం డబ్బులు నాలుగు గంటల్లో వారి ఖాతాల్లో పడుతున్నాయని గొప్పలు చెపుతున్న అధికారులు రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై దృష్టి సారించడం లేదు. మిల్లు యజమానులు ఇష్టారాజ్యంగా కోతలు విధిస్తున్నా అధికారులు కన్నెత్తి చూడడం లేదు. ఫలితంగా రైతులు తమ ఇబ్బందులను ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితుల్లో నష్టపోవడానికి కూడా సిద్ధమవుతున్నారు.

మిల్లుల వద్ద ధాన్యం కొనుగోలు బోర్డు ల్లేవు

ధాన్యం కొనుగోలుకు సంబంధించిన నిబంధనలతో కూడిన బోర్డులు ప్రతి రైస్ మిల్లు వద్ద వేలాడదీయాల్సి ఉంది. కానీ ఎక్కడా ఆ విధమైన బోర్డులు వేలాడదీసిన దాఖలాల్లేవు. అంతే కాకుండా మిల్లుల వద్ద కూడా తేమశాతం, పొల్లు శాతం అంచనా వేసే యంత్రాలు లేకుండానే ధాన్యం బరువులో కోతలు విధిస్తున్నారు. కొనుగోలు సీజన్ ప్రారంభంలో స్థానిక ఎమ్మెల్యేల చేత ప్రారంభించినప్పుడు బోర్డులు వేలాడదీసిన అధికారులు తర్వాత వాటిని కనిపించకుండా చేశారు.

ఐదు నుంచి పది కిలోల వరకు అదనంగా ధాన్యం సేకరణ

ధాన్యం కొనుగోలుకు సంబంధించిన డబ్బులు రైతు ఖాతాల్లో సకాలంలో పడుతున్నాయి. కానీ నిబంధనలు సాకుగా చూపి క్వింటాలుకు అదనంగా ఐదు కిలోల నుంచి పది కిలోల వరకు మిల్లు యజమానులు తీసుకుంటున్నారు. దీని వల్ల రైతులు క్వింటాలుకు సుమారు రూ.300 రూపాయల వరకు నష్టపోతున్నారు.

బంటు దాస్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి



ట్రక్‌షీట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

నిబంధనల ప్రకారం కొనుగోలు చేపట్టాలి : కలెక్టర్

- తప్పుడు తూనికల పట్ల ఆగ్రహం
- విజయలక్ష్మి రైస్‌మిల్‌కు షోకాజ్ నోటీసు

ప్రజాశక్తి - సీతానగరం

రైతు నుంచి నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి సిబ్బందికి సూచించారు. మండలంలోని కోట సీతారాంపురం గ్రామాన్ని ఆకస్మికంగా పర్యటించి, ధాన్యం కొనుగోలు ప్రక్రియను, రైతులకు ఎదురవుతున్న సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ముందుగా ధాన్యం నూర్పిడి జరుగుతున్న ప్రాంతాన్ని సందర్శించి, రైతులు, సిబ్బందితో మాట్లాడారు. ధాన్యాన్ని నిబంధనల ప్రకారం తూకం వేయాలని ఆదేశించారు. గోనె సంచులు, రవాణా సౌకర్యం రైతు సేవా కేంద్రాల నుంచి కల్పిస్తున్నామని అధికారులు వివరించారు. రవాణా ఖర్చు రైతులకే చేరుతోందా లేదా అని కలెక్టర్ పరిశీలించారు. అనంతరం రైతు సేవాకేంద్రానికి వచ్చి ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలించారు. తేమ శాతం 17శాతం కంటే తక్కువగా ఉందని, ఎటువంటి సమస్య రాలేదని సిబ్బంది తెలిపారు. ధాన్యం కొనుగోలు అంశం తర్వాత, కలెక్టర్ రైతులతో వ్యవసాయానికి సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ ప్రాంతం డ్రై ఏరియా కావడంతో రైతులు ఎక్కువ ఇబ్బంది పడకుండా, అధిక ఆదాయం కోసం రబీలో ఉద్యాన పంటల వైపు మొగ్గు చూపాలని సూచించారు. ఈ పంటల వల్ల ఆదాయం పెరుగుతుందని, ఇబ్బంది పడాల్సిన అవసరం ఉండదని వివరించారు. రైతులు తమకు బోర్ వెల్స్ సరిగా పడడం లేదని, కాలువ సౌకర్యం కావాలని కలెక్టర్‌ని కోరారు. గ్రౌండ్ వాటర్ అధికారులతో మాట్లాడి, ఆ ప్రాంతంలో బోర్ వెల్స్ ఎక్కడెక్కడ పడతాయో సర్వే నివేదికలు అందజేయాలన్నారు.

రైస్‌మిల్లు యాజమాన్యం అవకతవకలపై ఆగ్రహం

బలిజిపేట : మండలంలోని విజయలక్ష్మి రైస్ మిల్‌ను కలెక్టర్ సందర్శించారు. ఈ మిల్లులో అవకతవకలకు పాల్పడుతున్నట్లు కలెక్టర్ నిర్ధారించారు. ఒక బస్తా 85 కేజీలు వస్తున్నట్లు గుర్తించారు. రైతులను మోసగిస్తున్నారని గుర్తించారు. ట్రక్ షీట్ వాహనానికి మధ్య వ్యత్యాసాలు ఎక్కువగా కనిపిస్తున్నాయని కలెక్టర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరిపై తగు చర్య తీసుకోవాలంటూ అధికారులు హెచ్చరించారు. సకాలంలో రైతులకు బిల్లు అకౌంట్లో జమయ్యేలా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, చర్యలు తీసుకోవాలని కోరారు.

అనంతరం మండలంలోని వంతరాం కస్తూరిబాయి గాంధీ బాలికల విద్యాలయంలో సందర్శించి విద్యార్థులతో కొంతసేపు ముచ్చటించి, స్వచ్ఛ ఆంధ్ర అందరితో చేయించి గ్రామ పంచాయతీ అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ తదుపరి విద్యార్థులతో ఫైర్ యాక్సిడెంట్లు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు ఎలా తీసుకుంటారు దానిపై అవగాహన కల్పిస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలు పాఠశాలలో వంటశాలను పరిశీలించారు. విద్యార్థులతో పాటించాల్సిన జాగ్రత్తలను సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, తహశీల్దార్ బాలమురళీకృష్ణ, ఎఒ శివగణేష్, ఎంఇఒ సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల జీతాలు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు నవంబర్ నెల జీతాలు ఇంకా చెల్లించ లేదని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ మురళీమోహనరావు అన్నారు. అన్ని మేనేజ్మెంట్‌లోని ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు చెల్లించకపోవడం అన్యాయమని అన్నారు. డిసెంబర్ 8వ తేదీ వచ్చినప్పటికీ జీతాలు చెల్లించకపోవడం వల్ల ఉపాధ్యాయులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జీతాలను చెల్లించాలని, లేకుంటే ఆందోళన చేపడతామని ఒక ప్రకటనలో హెచ్చరించారు.

రైస్‌మిల్లు తనిఖీ చేసిన సబ్ కలెక్టర్

ప్రజాశక్తి పాలకొండ

మండలంలోని తుమరాడలో గల రైస్ మిల్లును సబ్ కలెక్టర్ స్వప్నల్ జగన్నాథ్ ఆదివారం తనిఖీ చేశారు. రికార్డులను సక్రమంగా ఉన్నాయా లేదా పరిశీలించారు. రైతుల దగ్గర సక్రమంగా ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతుల నుంచి ధాన్యం సేకరించి గిట్టుబాటు ధర అందించాలన్నారు. కొలతల్లో తేడా రావద్దు అన్నారు. రైతు నుంచి ఫిర్యాదులు వస్తే సహించేది లేదన్నారు. ఆయన వెంట సిఎస్‌డిటి సన్యాసిరావు ఉన్నారు.

ధాన్యం రైతులను దగా చేస్తున్న మిల్లర్లు

ప్రజాశక్తి - బలిజిపేట

ధాన్యం రైతులను రైస్‌మిల్లర్లు దగా చేస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని రైతు సంఘం నాయకులు గేదెల సత్యనారాయణ, రెడ్డి వేణు, వై.మన్మథరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. రైస్ మిల్లర్లు, ప్రైవేటు వ్యక్తులు దళారీలు ప్రభుత్వం ప్రకటించిన ఎ-గ్రేడ్ రూ.2389, బి-గ్రేడ్ రూ.2369, కింటాకు కొనుగోలు చేయాలని ప్రకటన చేసిన రైతులను దగా చేస్తూ ధాన్యం పాలిపోయాయని, మొలకలు ఉన్నాయని, బాగోలేదని రూ.1600కు, రూ.1550కు కొనుగోలు చేస్తున్నారన్నారు. 40 కేజీలకు మూడు కేజీలు, 80 కేజీలకు ఆరు కేజీల అదనంగా తీసుకుంటున్నారని, దింపుడుకు బస్తాకు ఐదు రూపాయలు తీసుకుంటున్నారని, అయినా రైతుల్ని అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, ప్రతి గింజ తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు పి. వెంకటస్వామి, వెన్నెల వేణు, దుర్గారావు, బలరామనాయుడు, లక్ష్మమ్మ, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి రెండు నాలుకల ధోరణి విడనాడాలి

పిఎస్‌పి ప్లాంట్ అనుమతులు రద్దు చేయాలి

ప్లాంట్ వ్యతిరేక పోరాట కమిటీ

ప్రజాశక్తి - మక్కువ

గిరిజనులకు, రైతాంగానికి తీవ్రంగా నష్టం చేకూర్చే 2వేల మెగావాట్ల పంపుడు స్టోరేజ్ హైడ్రో పవర్ ప్లాంట్‌పై గిరిజనశాఖామంత్రి సంధ్యారాణి రెండు నాలుకల ధోరణి విడనాడాలని, గిరిజనులకు నష్టపరిచే ప్రాజెక్టును రద్దు చేయాలని దుగ్గేరు పంపుడ్ స్టోరేజ్ హైడ్రో పవర్ ప్లాంట్ వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ రాయల సుందర్రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఎర్ర సామంత వలసలో పోరాట కమిటీ సమావేశం జరిగింది. ఈ ప్రాజెక్టు వల్ల తరతరాలుగా ఈ కొండల్లో బతుకుతున్న మక్కువ, సాలూరు మండలాలకు చెందిన పనసభద్ర, కొదమ పంచాయతీలోని అనేక గిరిజన గ్రామాలు ఖాళీ చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు చుట్టుపక్కల ఉండే గ్రామాల్లో కూడా ఈ ప్రాజెక్టు ప్రభావం ఉంటుందని, అనేకమంది భూములు వదులుకోవాల్సి వస్తుందని తెలిపారు. దీంతో పచ్చని అడవులు నాశనమవుతాయని, అందుకే ఈ ప్రాంతంలో ఉండే ప్రజానీకమంతా కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. మనం ఎన్నుకొని అధికారంలోకి వచ్చిన ఈ ప్రభుత్వ ప్రతినిధులు మన వైపు నిలబడరని అన్నారు. ఈ ప్రాజెక్టు కోసం మంత్రివర్గ తీర్మానం చేసినప్పుడు సాలూరు ఎమ్మెల్యే, మంత్రి సంధ్యారాణి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. తీరా ప్రజలు దీనిపై అడగడానికి వెళ్తే ప్రజాభిప్రాయ సేకరణ తర్వాతే పవర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని మాట్లాడుతున్నారని, ఇలా రెండు నాలుకల ధోరణి ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. ప్రజాబలంతోనే ఈ ప్రాజెక్టును అడ్డుకోగలమని అన్నారు. ఆర్‌సిఎస్ రాష్ట్ర డి.వర్మ సమావేశంలో హైడ్రో పవర్ ప్లాంట్ వల్ల జరిగే నష్టాలతో కూడిన డిమాండ్ల గల గోడ పత్రికను విడుదల చేశారు. అలాగే ఈ కార్యక్రమానికి పోరాట కమిటీ కో కన్వీనర్లు ఊయక ముత్యాలు, మర్రి చెంచు, పీడిక ఆసిరి, సభ్యులతో పాటు ఎర్రసామంత వలస గ్రామ పెద్దలు రాయల అప్పారావు, శీదరపు సూరయ్య, వివిధ గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు.



గౌరునాయుడును సన్మానిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

గంటేడకు సన్మానం

ప్రజాశక్తి - పార్వతపీఉరం

తాపీ ధర్మారావు పురస్కారాన్ని అందుకున్న కవి, రచయిత గంటేడ గౌరు నాయుడును ఆదివారం గుంటూరులో ఘనంగా సన్మానించారు. బండికల్లు వెంకటేశ్వర్లు ఫౌండేషన్ నిర్వహించిన పురస్కార ప్రదానోత్సవంలో గౌరునాయుడును గుంటూరులోని కొరటాల సమావేశమందిరంలో సన్మానించారు. తాపీ ధర్మారావు పురస్కారానికి గంటేడ ఎంపిక కావడంపై పట్టణానికి చెందిన పలువురు కవులు, రచయితలు హర్షం వ్యక్తం చేశారు.

తప్పుడు విమర్శలు తగవు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి -పాలకొండ

కూటమి ప్రభుత్వంపై మాజీ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పుష్ప శ్రీవాణి, మాజీ ఎమ్మెల్యే కళావతి తప్పుడు విమర్శలు చేయడం సరి కాదని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. తల్లికి వందనం ఎవరికీ అందడం లేదని అనడం విడ్డూరంగా ఉందన్నారు. ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలు మీ ప్రభుత్వంలోనే రూ.1637 కోట్లు ఉండగా వాటిని తమ ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అదేవిధంగా గ్యాస్ సబ్సిడీ అర్హులు అందరికీ జమవుతుందన్నారు. భామిని మండలంలో ఒక కుటుంబంలో ఏడుగురు పిల్లలుంటే ఆరుగురికి తల్లికి వందనం పథకం వర్తించిందన్నారు. తోటపల్లి కాలువల ఆధునీకరణకు టిడిపి ప్రభుత్వం 2018లో రూ.195 కోట్లు మంజూరు చేయగా, 2019 నుంచి 2024 వరకు మీరు ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. అయినప్పటికీ తాము సిఎం దృష్టికి తీసుకెళ్లామని, తోటపల్లి కాలువ పనుల విషయంలో తాము సానుకూలంగా ఉన్నామని అన్నారు. మంత్రి సంధ్యారాణిపై తప్పుడు వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. మెగా పేరెంట్ సమావేశాల్లో ఏ నియోజకవర్గ పరిధిలో ఆ నియోజకవర్గంలో ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని ప్రభుత్వం ఆదేశించిందని, ఆ క్రమంలో ఇక్కడ హాజరు కాలేదన్నారు. గిరిజనసంక్షేమ శాఖ మంత్రిగా పనిచేసిన పుష్ప-శ్రీవాణి కురుపాం నియోజకవర్గానికి ఏం చేశారని ప్రశ్నించారు.

విలేకరుల సమావేశంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి కె.అప్పలనాయుడు, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గర్భన సత్తిబాబు, టిడిపి పట్టణ అధ్యక్షులు గంట సంతోష్ కుమార్, జాడ శ్రీధర్, కొండ దడి రాజేష్, అంపోల శ్రీను, సుంకర అనిల్ తదితరులు ఉన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి లక్ష్మి

మహిళలపై హింసా ధోరణి అరికట్టాలి : ఐద్వా

ప్రజాశక్తి - సీతానగరం

మహిళలు, బాలికలపై హింసను అరికట్టాలని ఐద్వా జిల్లా కార్యదర్శి బి.లక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళా-బాల బాలికలపై హింస- వ్యతిరేక వారోత్సవాల్లో భాగంగా మండలంలోని జోగింపేటలో ఆదివారం ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు వి.రామలక్ష్మి అధ్యక్షత సదస్సు జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ సమాజంలో రోజురోజుకు మహిళల పట్ల హింసా ధోరణి పెరగడం విచారకరమన్నారు. పాశ్చాత్య సంస్కృతి విచ్చలవిడిగా దేశంలో ప్రవేశించడంతో మహిళ పట్ల సమాజం వ్యవహరించే తీరే మారిపోయిందని, ఈ ధోరణి అరికట్టేందుకు పాలకవర్గాలు స్పష్టమైన విధానాలను రూపొందించాలని డిమాండ్ చేశారు. దేశంలో ప్రతి ముగ్గురిలో ఒకరు హింసకు గురవుతున్నట్టు నివేదికలు తెలియజేస్తున్నాయంటే ఎంత ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయో అర్థమవుతుందన్నారు. మహిళలు శారీరక, మానసిక, ఆర్థిక హింసతో పాటు ఇటీవల డిజిటల్ హింస కూడా పెరిగిపోయిందని, సోషల్ మీడియాలో మహిళల పట్ల వేధింపులు కూడా పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ధోరణి నివారించేందుకు ప్రభుత్వాలు కట్టుదిట్టమైన చట్టాలను రూపొందించి మహిళలు, బాలికల రక్షణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విద్యార్థినులు బాగా విద్యను అభ్యసించి, సాధికారత సాధించి సామాజిక స్పృహ పెంపొందించుకొని ఇలాంటి పెడధోరణులకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మహిళలు ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి చెందితే ఇలాంటి హింసాపోకడల నుంచి బయటపడొచ్చని మహిళలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థినులు, మహిళలు పాల్గొన్నారు.

గిరిజన ఉత్పత్తులకు మద్దతుధర

ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన అటవీ ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని గిరిజన సహకార సంస్థ డివిజనల్ మేనేజర్ జె.రామారావు చెప్పారు. గిరిజన సంతల్లో నాణ్యమైన నిత్యావసర వస్తువుల కొనుగోలు కోసం దుకాణాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిసిసి చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలను ప్రజాశక్తితో డిఎం జె.రామారావు ముఖాముఖి మాట్లాడారు.

-ప్రజాశక్తి, పార్వతీపురం



- సంతల్లో నాణ్యమైన వస్తువుల విక్రయానికి చర్యలు
- జిసిసి వార్షిక ఆదాయ లక్ష్యం రూ.66కోట్లు
- 'ప్రజాశక్తి'తో గిరిజన సహకార సంస్థ డివిజనల్ మేనేజర్ జె.రామారావు ముఖాముఖి



● జిసిసి వార్షిక ఆదాయ లక్ష్యం ఎంత ? ఇంతవరకు ఎంత సాధించారు?

పార్వతీపురం జిసిసి డివిజన్ వార్షిక ఆదాయ లక్ష్యం రూ.66కోట్లు. ఈ ఏడాది అక్టోబర్ నాటికి రూ.26 కోట్లు సాధించాల్సి ఉంది. అయితే రూ.24.3కోట్ల ఆదాయాన్ని చేరుకున్నాం. 83 శాతం లక్ష్యాన్ని సాధించాం. చిన్నతరహా అటవీ ఉత్పత్తుల కొనుగోలు లక్ష్యం రూ.4.3 కోట్లు. నవంబర్ నాటికి లక్ష్యం రూ.25లక్షలయితే రూ.38లక్షలకు చేరుకున్నాం. ఈ ఏడాది డిసెంబర్ నుంచి అటవీ ఉత్పత్తుల కొనుగోలు సీజన్ ప్రారంభమవుతుంది.

● అటవీ ఉత్పత్తుల కొనుగోలుకు అమలు చేస్తున్న ప్రణాళిక ఏమిటి?

గిరిజనులు సేకరించిన అటవీ ఉత్పత్తుల కొనుగోలుకు సరైన ప్రణాళిక సిద్ధం చేశాం. పది మండలాల్లో 978 గిరిజన గ్రామాల్లో 9147 మంది రైతులను గుర్తించాం. 95 గ్రామపంచాయతీల పరిధిలో 101 డిఆర్ డిపోలకు 91 డిపోల్లో సర్వే నిర్వహించాం. నవంబర్ 19 నుంచి డిసెంబర్ 7వరకు 129చోట్ల అవగాహన సదస్సులు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఐటిడిఎ పిఒలతో కలిసి మార్కెట్లో ఉత్పత్తుల కున్న డిమాండ్‌ను బట్టి ధరలను నిర్ణయించాం.

● గిరిజన సంతల్లో మోసాల నివారణకు చేపడుతున్న చర్యలు ఏమిటి?

ఏజెన్సీ ప్రాంతాల్లో చాలా చోట్ల గిరిజన సంతలు జరుగుతున్నాయి. వాటిలో నాణ్యతలేని నిత్యావసర వస్తువుల కొనుగోలు వల్ల గిరిజనులు ఆర్థికంగా, ఆరోగ్య పరంగా నష్టపోతున్న పరిస్థితి నెలకొంది. దీనిపై గిరిజనులల్లో అవగాహన కల్పించేందుకు సంతల్లో జిసిసి దుకాణాలు నిర్వహిస్తోంది. నాణ్యమైన నిత్యావసర సరుకులను గిరిజనులకు అందుబాటులో వుంచుతూ సరసమైన ధరలకు విక్రయిస్తున్నాం. బిర్సా ముండా జయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సంతల్లో నాణ్యమైన వస్తువుల విక్రయానికి దుకాణాలు ఏర్పాటు చేస్తున్నాం.

● జిసిసిలో సిబ్బంది కొరత ఏమేరకు వుంది?

సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. ఉద్యోగవిరమణ చేసిన ఉద్యోగుల స్థానంలో భర్తీ చాలా కాలంగా నిలిచిపోయింది. ఫలితంగా ఉద్యోగుల కొరత అధికంగా కనిపిస్తోంది. ఉన్నవారితో పని చేయించుకుంటూ లక్ష్యాన్ని సాధించడానికి ప్రయత్నిస్తున్నాం. డివిజన్ పరిధిలో 101 డిపోలున్నాయి. 26 డిపోలకు సిబ్బంది లేరు. ఒక్కో ఉద్యోగి రెండు, మూడు డిపోలను చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. డివిజనల్ కార్యాలయంలో ఐదుగురు ఉద్యోగులు పని చేయాల్సి ఉండగా ఇద్దరే ఉన్నారు. డివిజన్ పరిధిలో రెగ్యులర్ సేల్స్ మాన్ లు 9మంది, కాంట్రాక్టు సేల్స్ మాన్‌లు 24మంది, స్వయం సహాయక సంఘాల సిబ్బంది 11మంది, డీలర్లు 31మంది ఉన్నారు.

● జిసిసి బ్రాంచ్ కార్యాలయాలు,డిపోల మరమ్మతులకు చేపట్టిన చర్యలు ఏమిటి?

గుమ్మలక్ష్మీపురం, పార్వతీపురం, సాలూరు జిసిసి బ్రాంచ్ కార్యాలయాల పరిధిలో 32 డిపోల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో పనులు ప్రారంభం కానున్నాయి. మూడు మోడల్ డిపోల్లో మినీ సూపర్ బజార్‌ల నిర్మాణానికి చర్యలు చేపట్టాం. సాలూరు మండలంలోని నంద, గుమ్మలక్ష్మీపురం మండలంలోని మొండెంఖల్, కొమరాడ మండలంలోని కూనేరు ల్లో మినీ సూపర్ బజార్ ల ఏర్పాటుకు ప్రతిపాదించాం. సాలూరు బ్రాంచ్ కార్యాలయం స్థలంలో ఆఫీస్ కం మినీ సూపర్ బజార్ ఏర్పాటుకు ప్రతిపాదన చేశాం. గుమ్మలక్ష్మీపురంలో పాత భవనం స్థానంలో కొత్త భవన నిర్మాణం రూ.28లక్షలతో జరిగింది. ఇక్కడే సూపర్ బజార్ కం వాణిజ్య సముదాయాల నిర్మాణానికి అంచనా వేస్తున్నారు. పార్వతీపురంలోని వైకెం కాలనీలో జిల్లా ఎస్పీ కార్యాలయం పక్కన ఉన్న 26 సెంట్ల స్థలంలో డివిజన్ కార్యాలయం నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ ప్రసాద్

ధాన్యం కొనుగోలులో ఇబ్బందుల్లేకుండా ఉండాలి

మండల సమావేశంలో సభ్యులు డిమాండ్

ప్రజాశక్తి - సీతానగరం

ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు లేకుండా, సక్రమంగా చేపట్టి, రైతులను దళారుల నుంచి కాపాడాలని పలువురు ప్రజాప్రతినిధులు అధికారులను కోరారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి బి.రవణమ్మ అధ్యక్షతన సమావేశం జరిగింది. తొలుత వ్యవసాయ శాఖ నుంచి ఎఒ అవినాష్ మాట్లాడుతూ మండలానికి రెండు లక్షల 13 సంచులు రైతులకు అందజేశామన్నారు. వీటి ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా అందించామని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళు చేస్తున్నామని చెప్పారు. దీనికి సర్పంచులు స్పందిస్తూ గోనె సంచులు ఏవీ బాగోలేదని, అన్నీ చిరిగిపోయినవే ఉన్నాయని తెలిపారు. రైతులకు నేరుగా సప్లై చేసి ఎటువంటి డబ్బులు చెల్లించకుండా ఉండే చడాలని కోరారు. దీనికి వ్యవసాయశాఖ నుంచి స్పందిస్తూ రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు. అనంతరం వైద్య శాఖ ప్రగతి గురించి వైద్యాధికారి మాట్లాడుతూ ఇదే కాలంలో కుష్టు వ్యాధి సర్వే, ఈనెల 21న జరిగే పల్స్ పోలియోను విజయవంతం చేయాలని కోరారు. విద్యాశాఖ ప్రగతిపై ఎంఇఒ ఎం.వెంకటరమణ మాట్లాడుతూ ముస్తాబు కార్యక్రమంలో భాగంగా అన్ని పాఠశాల్లోనూ విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. అలాగే వివిధ శాఖల నుంచి అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను వివరించారు. సమావేశంలో జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, ఎంపిడిఒ ఎంఎల్‌ఎన్ ప్రసాద్, విద్యుత్‌శాఖ ఎఇ పి.శశిభూషణరావుతో పాటు పలు శాఖల అధికారులు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలోనే అన్ని రంగాలూ అభివృద్ధి : ఎమ్మెల్యే



ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుంటే దాన్ని చూసి ఓర్వలేక వైసిపి నాయకులు ఒళ్లు కళ్లుకుంటున్నారని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మండిపడ్డారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాల భామినిలో జరిగిన పిఎంటిలో సిఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖామంత్రి లోకేష్ పర్యటనకు సంబంధించి మాజీ ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి మాట్లాడిన మాటలను ఎమ్మెల్యే జగదీశ్వరి ఖండించారు. కరోనా సమయంలో వైసిపి ప్రభుత్వం ఉపాధ్యాయులచే వైన్‌షాపుల్లో సెక్యూరిటీ గార్డులా ఉంచడం, స్కూల్ బాత్రూం దగ్గర ఫొటోలు, ఇలాంటి పనులు చేయించిన తీరు సమాజానికి సిగ్గుచేటు అన్నారు. కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులను గౌరవించడంలో అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాన్ని విమర్శించడం వైసిపికి అలవాటుగా మారిందని విమర్శించారు.


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - కొమరాడ

విశాఖపట్నంలో ఈనెల 31 నుంచి జనవరి 4 వరకు జరిగే సిఐటియు మహాసభలను, బహిరంగ సభను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. మండలంలోని గుమడ సంతలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ప్రచారం చేశారు. అనంతరం సమ్మెకు సంబంధించిన గోడ పత్రికలు విడుదల చేశారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ వివిధ రంగాల కార్మికులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా ఈ మహాసభల్లో చర్చలు జరుగుతాయన్నారు. ఇందులో భాగంగా జనవరి 4న భారీ బహిరంగసభ విశాఖ ఆర్‌కె బీచ్‌లో జరుగుతుందన్నారు. కావున ఈ బహిరంగ సభకు అన్ని రంగాల కార్మికులు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

సురేష్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఎల్విన్‌పేటకు చెందిన సురేష్ పాత్రో కుటుంబాన్ని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఆదివారం పరామర్శించారు. సురేష్ తల్లి శాంతి పాత్రో అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయన స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆకస్మాత్తుగా తల్లిని కోల్పోయి విషాదంలో ఉన్న కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ ఎమ్మెల్యే ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.


వార్షికోత్సవంలో పాల్గొన్న డిప్యూటీ డిఇఒ రామ్మోహనరావు, కాలేజీ సిబ్బంది

ఘనంగా ఒకేషనల్ కళాశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎలో గల అల్లూరి సీతారామరాజు ఒకేషనల్ జూనియర్ కళాశాల 20వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐటిడిఎ డిప్యూటీ డిఇ జి.రామ్మోహనరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు తల్లిదండ్రులు కూడా బాధ్యత వహించాలన్నారు. ప్రణాళిక ప్రకారం చదివితే ఉత్తీర్ణత తప్పనిసరిగా ఉంటుందన్నారు. చిన్నప్పటి నుంచే కష్టపడి చదవాలని, అప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. చదువుతో పాటు క్రమశిక్షణ ఉండాలన్నారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.గోవిందరాజులు, డిఎల్‌వి సావిత్రి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధోనుబాయి కూడలిలో వాహన తనిఖీలు

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో దోనుబాయి కూడలి వద్ద సీతంపేట ఎస్సై వై.అమ్మనరావు ఆదివారం సాయంత్రం డ్రంకింగ్ డ్రైవ్ వాహనాలు తనిఖీలు చేపట్టారు. ప్రతి వాహనదారులకు ఏనలైజర్ బ్రీతింగ్ టెస్టింగ్ నిర్వహించారు. వాహనాలు ధ్రువపత్రాలు తనిఖీలు చేశారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. మితిమీరిన వేగంతో వేళరాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించారన్నారు. ఎస్సై తో పాటు పోలీసులు ఉన్నారు

బోరుకు మరమ్మతులు చేయండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక టౌన్ రైల్వే స్టేషన్ పరిధిలో ఉన్న శ్మశాన వాటికలో ఉన్న బోరు మరమ్మతుల గురై కొన్ని నెలలైనా ఈ బోరుకు మరమ్మతులు చేసేందుకు మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో, ఆ శ్మశాన పరిధిలో ఉన్న పలు వార్డుల్లో మృతదేహాలను దహన సంస్కారాలకు, ఖననానికి తీసుకువచ్చిన కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయంపై పలుమార్లు స్థానిక ప్రజలు సంబంధిత కౌన్సిలర్లు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ మరమ్మతులు చేయకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు వెంటనే దృష్టి సారించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

గిరిజన గుండె చప్పుళ్లను అక్షరాల్లో మలిచిన 'దుర్ల'

ప్రజాశక్తి -కురుపాం

ఆదివాసీ సమస్యలు, గిరిజనుల జీవన విధానం, వారి పోరాట స్వభావాన్ని అక్షరాల రూపంలో నిజాయితీగా ఆవిష్కరించిన కవితా సంకలనమే 'దుర్ల' అని ప్రముఖ రచయిత రౌతు బంగారునాయుడు అన్నారు. ఆదివారం స్థానిక స్నేహికళా సాహితీ కార్యాలయం వద్ద మల్లిపురం జగదీష్ రాసిన 'దుర్ల' కవితా సంకలనం పరిచయ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని పరిచయం చేశారు. ఈ సందర్భంగా బంగారు నాయుడు మాట్లాడుతూ గిరిజన సంప్రదాయాలు, నిత్యజీవిత సంక్షోభాలు, ఈ ప్రాంతంలోని దోపిడీ, రిజర్వేషన్ హక్కుల కోసం సాగుతున్న నిరంతర పోరాటాన్ని రచయిత నిర్మొహమాటంగా వ్యక్తపరిచారని కొనియాడారు. గిరిజన హృదయంలోని నొప్పిని సూటిగా చూపించే ఈ రచన సమాజాన్ని ఆలోచింప చేసే సామర్థ్యం కలిగి ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రచయిత మల్లిపురం జగదీష్, తెలుగు అధ్యాపకులు నడికట్ల మురళీకృష్ణ, మాజీ జడ్పిటి సభ్యులు అంధవరపు కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు ఆకుల జగదీష్, స్థానికులు గోవింద కృష్ణారావు తదితరులు



సమావేశంలో మాట్లాడుతున్న మల్లిపురం జగదీష్

ధారపాడులో సమస్యల కొలువు

- వెంటాడుతున్న తాగునీటి కష్టాలు
- కాలువలు, సిసి రోడ్లు లేక అవస్థలు

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజనాభివృద్ధికి కోట్లాది రూపాయలు కేటాయిస్తున్నామని పాలకులు, అధికారులు ప్రకటనలు గుప్పిస్తున్నా ఆచరణలో ఎక్కడా ముచ్చుకైనా కనిపించడం లేదు. ఇప్పటికీ అనేక గ్రామాల్లో తాగునీరు, సిసి రోడ్లు వంటి సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. దీంతో వారికి ఇబ్బందులు తప్పడం లేదు. ఇలాంటి పరిస్థితే మండలంలోని ధారపాడులో నెలకొంది.

మండలంలోని ధారపాడు పంచాయతీలో 15 గిరిజన గ్రామాలు ఉన్నాయి. వీటిలో రామానగరం, పెద్ద గూడ, దబర, దబరగూడ, జాతపు రామానగరం, చింతమానుగూడ ఓమానుగూడా, గోలుకుప్పగూడా, రామానగరం కాలనీ, చీడిమానుగూడ, బోతయ్య గూడ ఇలా 11గిరిజన గ్రామాలకు సిసి రోడ్లు లేకపోవడంతో గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారు. సిసి రోడ్లతో పాటు కాలువలు కూడా లేకపోవడంతో వర్షం నీరు, వాడుక నీరు ఇంటి ముందే ప్రవహిస్తుంటే దోమలు, ఈగలు స్వైర విహారం చేస్తున్నాయి. రాత్రి వేళల్లో కంటిమీద కునుకు లేకుండా పోతుంది. ఇక వర్షాకాలమైతే చెప్పాల్సిన అవసరం లేదు. వర్షపు నీరు ఇంటిముందు, రోడ్డుపైనే ప్రవహిస్తుంది. దీంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికే అధికారులకు, పిజిఆర్ఎస్‌లో వినతులు సమర్పించినా ప్రయోజనం కనిపించడం లేదని సర్పంచ్ జీలకర్ర సుందరమ్మ, గ్రామస్తులు శ్రీరాములు, తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వెంటాడుతున్న తాగునీటి సమస్య

ఇదే పంచాయతీలోని గోలుకుప్పగూడలో 25 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఈ గ్రామస్తులకు వేసవిలో తాగునీటి సమస్య వెంటాడుతూనే ఉంది. బోర్లు కూడా లేవు. గ్రామంలో ఉన్న ఊట బావిపైనే ఆధార పడాల్సి వస్తుంది. అది కూడా వేసవిలో ఎండిపోవడంతో నీటి సమస్య వెంటాడుతుంది. అలాగే ఒమానగూడలో 13 కుటుంబాలు ఉన్నాయి. ఈ గ్రామానికి బోర్లు లేవు. ఊటబావిపైనే ఆధారపడాల్సి వస్తుంది. అదే విధంగా దబరలో 31 కుటుంబాలు ఉండగా, ఒక బోరు ఉన్నప్పటికీ దాని నుంచి నీరు పడడం లేదు. దీంతో ఈ గ్రామస్తులు ఊటబావిపైనే ఆధారపడుతున్నారు. వేసవిలో ఉన్న ఊటబావి ఎండిపోతే ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంటుందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సిసి రోడ్లు మంజూరు చేయాలి



మండలంలోని ధారపాడు పంచాయతీలో 11 గ్రామాలకు సిసి రోడ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే అధికారులకు తెలియజేశాం. వరద గోడలు పంచాయతీ మొత్తం లేకపోవడంతో వర్షాకాలంలో వర్షపు నీరు ఇళ్లల్లోకి వస్తుంది. పిఎం జన్‌మాన్‌లో గృహాలు మంజూరైనప్పటికీ వివిధ దశాల్లో ఉన్న ఇళ్లకు బిల్లులు చెల్లించలేదు.

జీలకర్ర సుందరమ్మ
సర్పంచ్, ధారపాడు గ్రామపంచాయతీ.



ఆర్ అండ్ బి మెయిన్ రోడ్డు నుంచి రోడ్డు లేని బూర్జమానుగూడ

అదేవిధంగా ఆర్ అండ్ బి మెయిన్ రోడ్డు నుంచి బూర్జిగూడకు రోడ్డు లేకపోవడంతో గిరిజనులు అవస్థలు పడుతున్నారు. వెంటనే రోడ్డు వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ పంచాయతీ పరిధిలో గల కోసంగి, దబర, ధారపాడు, జాతపు రామానగరం, గోలు కుప్పగూడ తదితర 15 గ్రామాలకు వరద గోడ లేకపోవడంతో వర్షాకాలంలో వర్షపు నీరు కొండలపై నుంచి గ్రామాల్లోకి వచ్చి పడుతోంది. దీంతో ఇళ్ల గోడలు తడిచి ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లలో ఉన్నఉన్న నిత్యవసర సరుకులు కూడా తడిచిపోతున్నాయని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరద గోడలు మంజూరు చేయాలని ఇప్పటికే విన్నవించినా అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పిఎంజన్‌మాన్‌లో భాగంగా ధారపాడు పంచాయతీలో పిటిజిలకు 50 ఇళ్లు మంజూరు చేసినప్పటికీ పది ఇళ్ల శ్లాబ్ వేసినప్పటికీ, బిల్లులు చెల్లించలేదని లబ్ధిదారులు వాపోయారు.

ఆకర్షణలకు లోనుకావద్దు : సిఎంఒ

ప్రజాశక్తి - సీతంపేట

పాఠశాలలు, కళాశాలల్లో చదువుకుంటున్న విద్యార్థినిలు లేనిపోని ప్రేమ అనే ఆకర్షణలకులోనైతే బంగారు భవిష్యత్తు చీకటిమయవుతుందని, బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని సిఎంఒ చల్ల చిరంజీవులు సూచించారు. ఆదివారం స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 8, 9, 10 తరగతుల విద్యార్థినులకు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో ప్రేమకు ఆకర్షితులైతే జీవితంలో జరిగే పరిణామాలు దారుణంగా ఉంటాయన్నారు. ప్రేమకు లోనైతే జీవితంలో ఏం జరుగుతుంది, వీరిని నమ్ముకున్న తల్లిదండ్రులు ఏమవుతారో అని తెలియజేసే వీడియోలను స్క్రీన్ పై ప్రదర్శించి చూపించారు. చదువుకోవాల్సిన దశలో కొంతమంది కుర్రాళ్ళు లేనిపోని ఆకర్షణలకు గురి చేస్తే బాలికలు వ్యామోహితులై భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారని అన్నారు. తల్లిదండ్రులు, అన్నదమ్ములు, అక్కాచెల్లెలను ప్రేమించి, వారు ఆపదలో ఉన్న సమయంలో ఆదుకోవడం, మనకు విద్యాబుద్ధులు నేర్పిస్తున్న గురువులను ప్రేమించి అభిమానించాలని పేర్కొన్నారు. అంతేకానీ మోసపూరితమైన ఆకర్షణలకు గురై ఇటు మిమ్మల్ని, అటు నమ్ముకున్న తల్లిదండ్రులను ఇక్కట్లకు గురిచేసి మీ జీవితాలను మీరే నాశనం చేసుకుంటున్నారని బాలికలకు అవగాహన కల్పించారు. మంచిగా చదువుకొని భవిష్యత్తు లక్ష్యాన్ని సాధించి భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలని, బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని, దానివల్ల చాలా సమస్యలు ఎదుర్కోవల్సి వస్తుందని సిఎంఒ సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.వసంతలక్ష్మి, హెచ్‌డబ్ల్యుఒ పి.అమల, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

10న లక్ష్మీపురంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని లక్ష్మీపురంలో శ్రీకాకుళం రాగోల్ జేమ్స్ హాస్పిటల్ వైద్యులచే ఈనెల 10న ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు గ్రామ సర్పంచ్ తుమ్మలపల్లి వెంకటరమణ, సత్యవతి, ఎంపిటిసి సభ్యులు తుమ్మలపల్లి పార్వతి, గంగునాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో అన్ని రకాల వ్యాధులకు వైద్యాధికారులు వస్తారని, కావున ఈ అవకాశాన్ని గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామ ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలోని అంపిలి గ్రామానికి చెందిన ఎ.మల్లేశ్వరరావు (59) తిరుపతిలో ఆదివారం ఉదయం గుండె పోటుతో మృతి చెందాడు. ఐదేళ్ల క్రితం తాపీ పనికి వలస వెళ్లాడు. భార్య పద్మావతితో కలిసి అక్కడే ఉంటున్నారు. ఆదివారం ఒక్కసారి ఛాతినొప్పి వచ్చి కింద పడిపోవడంతో అక్కడికక్కడే మరణించారు. ఆయన మరణ వార్త తెలియడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

గిరిజనులకు రగ్గులు పంపిణీ

ప్రజాశక్తి - పాచిపెంట


దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎయిర్‌ఫోర్స్ వెటర్నస్ అసోసియేషన్ సభ్యులు

ఏజెన్సీలో ఎముకలు కొరికే చలి తీవ్రతను గుర్తించి విజయనగరం జిల్లా ఎయిర్ ఫోర్స్ వెటర్నస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండలంలోని బంగారు గుడ్డి, గాజులు గుడ్డి, కాట్రగుడ్డి గిరిజన గ్రామాల ప్రజలకు ఆదివారం రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బొడ్డేపల్లి రామకృష్ణారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి వ్యసనాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ ఎయిర్ వెటర్నర్ కృష్ణయ్య, నారాయణరాజు, రమణారావు, కిరణ్, సురేష్‌బాబు, ఫాతిమా, అప్పారావు, బుచ్చియ్య, తదితరులు పాల్గొన్నారు.


కృష్ణమూర్తికి శోభితవర్మ సేవా పురస్కారాన్ని అందజేస్తున్న నిర్వాహకులు

హెచ్‌సి కృష్ణమూర్తికి శోభిత వర్మ సేవా పురస్కారం

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కె.కృష్ణమూర్తి ప్రతి నెలా తనకు వచ్చే జీతంలో కొంత మొత్తాన్ని పేదలకు, విద్యార్థులకు, వృద్ధులకు, ఆపదలో ఉన్న వారికి ఖర్చు చేస్తూ ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న సేవ మూర్తికి శనివారం రాజమండ్రిలో ఉన్న సరస్వతి జ్ఞాన మందిరంలో శోభిత వర్మ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో శోభిత వర్మ సేవా పురస్కారాన్ని స్పెషల్ కమాండ్ ఫోర్స్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కొండా నరసింహారావు, డిఎస్‌పి సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, ఎస్‌వి కళాకారుల సేవా సంఘం నిర్వాహకులు సిహెచ్ శ్రీనివాస్ వర్మ తదితరులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తనకు ఉన్న దాంట్లో ఇతరులకు ఎంతో కొంత సేవ చేయాలనే సంకల్పం కలిగిన కృష్ణమూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.

పరిశీలనకే పరిమితమా?

బిల్లుల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు


బిల్లుల కోసం సర్వే చేస్తున్న హౌసింగ్ సిబ్బంది (ఫైల్)

ప్రజాశక్తి వీరఘట్టం

2014-19 అప్పటి టిడిపి ప్రభుత్వ హయాంలో అర్హులైన లబ్ధిదారులకు ఎన్టీఆర్ గ్రామీణ గృహ నిర్మాణ పథకం కింద ఇళ్లు మంజూరు చేశారు. అప్పట్లో గృహ నిర్మాణ పనులు వివిధ దశల్లో చేపట్టినప్పటికీ అధికారుల అలసత్వం వల్ల సకాలంలో బిల్లులు చెల్లింపులు జరగకపోవడంతో లబ్ధిదారులు అర్థాంతరంగా ఇళ్ల పనులను నిలిపివేశారు. అనంతరం వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పనులపై దృష్టి పెట్టకపోవడంతో అప్పట్లో నిర్మించిన గృహాలు అలాగే ఉండిపోయాయి. సొంత స్థలాలు కలిగిన వారికి ఇళ్లు మంజూరు చేస్తారన్న ప్రసక్తి లేకపోయింది. 2024లో కూటమి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడంతో 2014-2019లో చేపట్టిన ఎన్టీఆర్ గృహ నిర్మాణాలపై దృష్టి సారించడంతో గతేడాది అక్టోబర్‌లో మండలంలోని గృహనిర్మాణాలు ఏప స్థాయిలో ఉన్నాయో హౌసింగ్ అధికారులు పరిశీలించారు. ఈ మేరకు మండలంలో ప్రస్తుతం 526 ఇళ్లు వివిధ స్థాయిల్లో ఉన్నట్లు గృహ నిర్మాణ అధికారులు గుర్తించారు. వీటికి సంబంధించి సుమారు రూ.కోటీ 70 లక్షలు బిల్లులు బకాయిలు ఉన్నట్లు గృహ నిర్మాణ శాఖ అధికారులు లెక్కలు చెబుతున్నారు. వివిధ దశల్లో ఉన్న గృహ నిర్మాణాలు పరిశీలించి 13 నెలలు కావస్తున్నా ఇప్పటివరకు పైసా బిల్లు చెల్లించకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అర్థాంతరంగా నిలిచిపోయిన గృహాలకు సంబంధిత అధికారులు సర్వే చేయడంతో బిల్లులు వస్తాయని, ఇళ్ల నిర్మాణం పూర్తిచేసుకోవచ్చునని ఎంతో ఆశపడ్డామని, తమ ఆశను తుంగలో తొక్కినట్లయిందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి అర్థాంతరంగా నిలిచిపోయిన గృహాలకు బిల్లులు చెల్లించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ రూరల్ గృహ నిర్మాణ లబ్ధిదారులు కోరుతున్నారు.

ఈ విషయమై స్థానిక గృహ నిర్మాణ శాఖ ఎఇ వి.వినోద్ కుమార్ వద్ద 'ప్రజాశక్తి' ప్రస్తావించగా మండలంలోని వివిధ దశల్లో ఉన్న గృహ నిర్మాణాలకు సంబంధించి సర్వే చేసి నివేదికను జిల్లా హౌసింగ్‌శాఖ ఉన్నతాధికారులకు పంపించినట్లు తెలిపారు.

నవోదయ మోడల్ టెస్ట్‌కు అనూహ్య స్పందన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం


జియమ్మవలస మండలంలో గల తిరుమల సాయి హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన జవహర్ నవోదయ మెగా మోడల్ టెస్ట్‌కు విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించింది. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి సుమారు 15 మండలాల నుంచి 400 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. గత 20 ఏళ్లుగా నవోదయ మోడల్ పరీక్ష జరగడం, అందులో వందలాది మంది విద్యార్థులు పాల్గొనడం ఆనంద దాయక విషయమని ఎంఇఒ డి.గౌరునాయుడు అన్నారు. జవహర్ నవోదయ మెగా మోడల్ టెస్ట్ జనరల్ విభాగంలో ప్రథమ బహుమతి కొండగొర్రి లిఖితకుమార్ (తిరుమల సాయి) రూ. 3000, ద్వితీయ బహుమతి టి.హర్షవర్ధన్ (వివేక్ ఆనంద స్కూల్, మక్కువ), తృతీయ బహుమతి పి.శ్యామ సుందర్ (మక్కువ) పొందారు. ప్రతిభ చూపిన పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బహుమతులు అందించారు.



విజేతలతో తిరుమలసాయి సిబ్బంది

పాలకొండ రాజకీయాల్లో యువ నాయకత్వం


సిఎంతో సంతోష్‌కుమార్


సిఎంకు సమస్యలు వివరిస్తున్న రాజేష్

ప్రజాశక్తి - పాలకొండ

పాలకొండ రాజకీయాల్లో సరికొత్త మార్పులు చోటు చేసుకుంటున్నాయి. నిన్న మొన్నటి వరకు మండలంలో కాకలు తీరిన నేతలుగా పేరు ఉన్నవారంతా రాజకీయం చేయగా ప్రస్తుతం యువ నాయకత్వం రాజకీయాలను అందుపుచ్చుకుంటుంది. ఈ పరిస్థితి కూటమి పార్టీలోనే ఎక్కువగా కనిపిస్తుంది. యువకులు జోష్‌గా పనిచేస్తూ కూటమి పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకు వెళ్తున్నారు. ఇందులో భాగంగా పట్టణ టిడిపి అధ్యక్షులు గంట సంతోష్ కుమార్ ఆ వరుసలో ముందున్నారని చెప్పవచ్చు. టిడిపి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా కష్టపడి పని చేశారని ఆ పార్టీ వర్గాలే చెప్తున్నాయి. పార్టీ అధికారంలోకి వచ్చి కూడా జోష్‌గానే ఉన్నారని ఆయన వర్గీయులు అంటున్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే జయకృష్ణకు అత్యంత సన్నిహితుడుగా ఉన్న కొండదడి రాజేష్ జనసేన పట్టణ నాయకుడిగా కొనసాగుతూ ప్రభుత్వ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. మాజీ వైస్ ఎంపిపి సిఎం నాయుడు తనయుడు చొంగ శివానంద కూడా ఇటీవల కాలంలో పార్టీలో చురుగ్గా పనిచేస్తూ అందరిలో గుర్తింపు తెచ్చుకునే పరిస్థితి కనబడుతుంది. తాజాగా భామిని మండలం సిఎం పర్యటనలో టిడిపి పట్టణ అధ్యక్షులు గంట సంతోష్ కుమార్‌తో పాటు జనసేన పట్టణ నాయకులు రాజేష్ కలిసి పాలకొండ పట్టణ సమస్యలను వివరించినట్లు తెలుస్తుంది.


అంతర్రాష్ట్ర రహదారిపై చెత్త డంపింగ్ సరికాదు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

అంతర్‌రాష్ట్ర రహదారిపై చెత్త డంపింగ్ సరికాదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. పట్టణ శివారులో గల అంతర్ రాష్ట్ర రహదారిపై డంపింగ్ చేసిన చెత్తను ఆదివారం వారు చూసి విస్మయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అంతర్రాష్ట్ర రహదారిపై టన్నుల కొలదీ చెత్తను డంప్ చేయడం సరికాదన్నారు. తడి, పొడి చెత్త వేరు చేసే పరిస్థితి కానరాలేదన్నారు. వర్మీ కంపోస్ట్ తయారీ పత్తాకు లేదన్నారు. చిన్న చిన్న గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ చేసేలా చక్కగా అమలవుతుంటే పార్వతీపురం మున్సిపాలిటీలో మాత్రం అది కానరావడం లేదని విమర్శించారు. అంతర్‌రాష్ట్ర రహదారిపై చెత్త వేయడంతో ఈ రహదారిలో నిత్యం రాకపోకలు సాగించే వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే సమీపాన గల జట్టు ఆశ్రమ వాసులు, జగన్నాథపురం తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే పక్కనే ఉన్న గోపసాగరంలో వేయడం వల్ల ఆ నీరు కలుషితమవుతుందన్నారు. తడి, పొడి చెత్త వేరుచేసి, వర్మీ కంపోస్ట్ తయారు చేయాల్సి ఉండగా అటువంటివి కాన రాలేదన్నారు. చెత్త డంపింగ్ యార్డ్ తరలింపు విషయంలో అటు వైసిపి, ఇటు కూటమి ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి అంతర్‌రాష్ట్ర రహదారిపై చెత్తను తక్షణమే తొలగించాలని కోరారు. ఈ పర్యటనలో కాంగ్రెస్ నాయకులు వంగల దాలినాయుడు, కోలాకిరణ్, సాయి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సండే సరదాగా..

ప్రజాశక్తి - సీతంపేట


జలపాతం వద్ద కేరింతలు కొడుతున్న పర్యాటకులు

స్థానిక ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్క్ పర్యాటకులతో పోటెత్తింది. పార్కులో ఉన్న అందాలను ఆశ్వాదించడానికి జిల్లా నలుమూలల నుండే కాకుండా ఇతర జిల్లాల నుంచి పర్యాటకులు తరలివచ్చారు. జల విహార్ వద్ద పర్యాటకులు హాయి హాయిగా బోటు షికారు చేశారు. యువతీ యువకులు హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్లారు. అడ్వెంచర్ పార్క్‌లో ఉన్న సహాసోపితమైన క్రీడ నిర్వహించారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో విహరించారు అనంతరం మెట్టుగూడ జలపాతం వద్ద జలకాలాడారు.

జలపాతంలో పడి యువకుడు మృతి

ప్రజాశక్తి-సాలూరు

మండలంలోని కురుకూటి సమీపంలో ఆదివారం అడపరాయి జలపాతంలో పడి యువకుడు దుర్మరణం చెందాడు. రామభద్రపురంలోని మారుతీనగర్‌కు చెందిన గర్భాపు హరి(24) మరి కొంతమంది యువకులతో కలిసి జలపాతానికి చేరుకున్నాడు. అక్కడ విపరీతమైన రద్దీ ఉండడంతో జలపాతం దిగువున యువకులంతా కలిసి స్నానం చేస్తున్నారు. హరి లోతు ఎక్కువ ఉన్న ప్రాంతానికి వెళ్లటంతో బయటకు రాలేకపోయాడు. చివరికి నీటిలో మునిగి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న సాలూరు రూరల్ పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం సాలూరు ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు రూరల్ ఎస్ఐ నరసింహమూర్తి తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీ
ఫీల్డ్‌అసిస్టెంట్‌కు గాయాలు

ప్రజాశక్తి - కురుపాం


కురుపాం- గొరడ ప్రధాన రహదారిలో బుడ్డెమ్మఖర్జ సమీపంలో ఆదివారం సాయంత్రం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో కిచ్చాడ పంచాయతీ ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడు గొళ్ళ గౌరీశంకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన్ను కురుపాం సిహెచ్‌సికి తరలించి ప్రాథమిక వైద్యం అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు.

అధ్వాన రోడ్లతో అవస్థలు

ప్రజలకు తప్పని ఇక్కట్లు
ప్రకటనలకే పరిమితమైన పాలకులు

ప్రజాశక్తి - వీరఘట్టం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి అనంతరం పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ప్రతి పల్లెకు రహదారి సౌకర్యం కల్పిస్తామని పాలకులు ఆర్భాటంగా ప్రకటనలకే పరిమితమయ్యారే తప్ప ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో పల్లె ప్రజలు రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. మండలంలోని కాగితాడ, బల్లగుడ్డు, బట్టిగూడ, రామాపురం, నీలంపేట, గడబవలస గ్రామాలతో పాటు ఎంవి పురం నుంచి బిటివాడ, కొట్టుగుమ్మడ నుంచి కిమ్మీ బిటి రహదారి, సే బియ్యంవలస గ్రామాల నుంచి బిటివాడ, వంకాయలగెడ్డ నుంచి సంధిమానుగూడ గ్రామ రహదారి, నర్సిపురం నుంచి బట్టిగూడకు సరైన రహదారి సౌకర్యాలు లేకపోవడంతో చిన్నపాటి వర్షం కురిసినా వాటిపై ప్రయాణించాలంటే అవస్థలు పడాల్సిందే. ఈ రహదారులు అధ్వానంగా ఉండడం వల్ల విద్యార్థులు, గర్భిణీలు, రోగులు, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం 108, 104 వాహనాలు కూడా గ్రామాలకు వచ్చే దాఖలాల్లేవు. దీంతో గర్భిణీలు, రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆయా ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆ రోడ్లన్నీ గజానికి ఒక గొయ్యిగా ఏర్పడడంతో మరిన్ని ఇబ్బందులకు గురికావాల్సి వస్తుంది. ఇప్పటికైనా పాలకులు స్పందించి తాము పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పల్లె రహదారుల అభివృద్ధికి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


పాడైపోయిన ఎంవిపురం -బిటివాడ గ్రామాల మధ్య రోడ్డు